తరువాత మీరు మనదేశ ప్రధానమంత్రి అవడం తథ్యం. కనీసం దేశ ఆర్థిక, వాణిజ్య మంత్రిత్వ శాఖలు మీ అధీనంలోకి మరోసారి రాక మానవు.

మీ

అన్నాబత్తుల పుల్లన్న

పి. ఎస్: మీరు మంత్రయాక బుల్లెట్ ప్రూఫ్ వెస్ట్లని, అద్దాలని కూడా తిరస్కరించండి, అవన్నీ అమెరికన్ తయారీలే కాబట్టి. త్వరలో దేశం ఇంకాస్త బాగుపడొచ్చు.

# ఇట్స్ ఫన్నీ

జీవితంలో ఒకోసారి అనుకోని తమాషాలు జరుగుతూండటం కద్దు. ఇలాంటివి చెప్పకోడానికీ వినడానికి కూడా సరదాగా వుంటాయి. పడక పడక ఓ మనిషి అంబులెన్స్ కిందే పడటంలో చిన్న తమాషా వుంది కదా! ఇలాంటివి నేను అమెరికాలో వుండగా కొన్ని దినపత్రికల నుంచి సేకరించాను. అలాంటి వాటిలో కొన్ని....

('శనివారం నాది' అనే నవలలో నేను సృష్టించిన మహాంతి అనే దురదృష్టపు దొంగ పాత్ర దాదాపు ఇలాంటి సంఘటనలనే నవల్లో ఆద్యంతం ఎదుర్కొని పాఠకులని నవ్విస్తాడు).

అమెరికాలో....

* కొందరు దొంగలు దారికాచి ఓ రైలును ఆపి, తపాలా వారి పెట్టెని దోచారు. అయితే వారనుకున్నట్లుగా మని ఆర్డర్ తాలూకు డబ్బు బదులు సంచులు నిండా వుత్తరాలే వున్నాయని ఇంటికెళ్ళాక తెలుసుకున్నారు.

* కుక్క కరవడంతో మెడికల్ ఖర్చులని క్లెయిమ్ చేసిన ఓ పాలసీదారుడి మెడికల్ బిల్స్ తనిఖీ చేయడానికి అతనింటికి వెళ్ళిన

ఇన్సూరెన్స్ ఆఫీస్ వుద్యోగిని పెంపుడుకుక్క కరిచింది.

* తరచూ రాత్రుళ్ళు తన షాపులో పడి దొంగలు దోచుకు పోతూండటంతో విసిగిపోయిన ఓ సిగార్స్ షాపతను దొంగని ఫోటో తీయడానికి రహస్యంగా ఓ కెమేరాని అమర్చాడు. మర్నాడు షాపులో దొంగలు పడి ఆ కేమేరాని దొంగిలించారు.

* 1953లో న్యూయార్క్‌లోని హోటళ్ళలో వుంచిన 450 బైబిల్స్ దొంగిలించబడ్డాయి. (బైబిల్ చదివి దొంగతనం నేరం అని తెలుసుకున్న ఒకతను మాత్రం దానిని పోస్ట్‌లో తిప్పి పంపాడు).

* ఓ పోలీస్ ఆఫీసర్ నగరంలోని కార్ల దొంగతనాలగురించి జరిగిన కాన్ఫరెన్స్‌కి హాజరయ్యాడు. తర్వాత బయటికి వచ్చి చూశాక, తన కారు దొంగిలింపబడిందని గ్రహించాడు.

* ఓ బాధితుడు తన జేబులోని పర్స్‌ని పిక్ పాకెటర్ గాడెవడో కొట్టేశాడని, అందులో రెండువందల పది డాలర్లున్నాయని పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చాడు. అతని పేరు షెర్లాక్ హోమ్స్.

* కొందరు దొంగలు పధ్నాలుగు రోజులు కష్టపడి ఓ బేంక్ వాల్ట్ లోకి కిందనించి సొరంగం తవ్వి ప్రవేశించారు. అ వాల్ట్‌లోని సంచుల నిండా డబ్బు బదులు పాస్ చేయబడ్డ చెక్స్ వున్నాయి.

* ఓ దొంగతనం గురించి ఆరా తీయడానికి పోలీసులు ఓ ఇంట్లోకి వెళ్ళి వచ్చేసరికి, వాళ్ళ పోలీస్ కారులోని రేడియో మైక్రోఫోన్‌ని ఎవరో దొంగిలించారు.

* ఓ నేషనల్ పార్క్‌లోని చెరువులో ఒకే ఒక్క హంస (స్వాన్) వుండటంతో, అక్కడ పనిచేసే వుద్యోగస్థులు దానికో పార్టనర్‌ని కొనాలని చందాలు వసూలు చేశారు. కాని దానికితగ్గ పార్టనర్‌ని కొనడానికి ఆ ఒంటరి హంస మొగదో ఆడదో తెలుసుకోలేకపోయారు.

* ఖరీదైన ఓ స్పోర్ట్స్ కారు హై వేలో పాసయితే ఓ హైవే పెట్రోల్ పోలీస్ మేన్ తనకి తెలిసిన మెకానిజంతో దాన్ని బాగుచేసి పెట్టాడు. డ్రయివర్ 'థాంక్స్ చెప్పి' వెళ్ళిన అయిదు నిముషాలకి వైర్‌లెస్‌లో దొంగిలింపబడ్డ ఓ కారు నెంబరు ఆ పోలీస్‌కి తెలియజేయ

బడింది. అతను బాగుచేసిన కారు నెంబరే దొంగిలింపబడ్డ కారు.

* ఓ పోలీస్ ఆఫీసర్ రాంగ్ పార్కింగ్ ప్లేస్‌లో పార్క్ చేయబడ్డ ఓ కారుకి టికెట్ (చలాన్) రాసి దాని విండ్‌షీల్డ్ వైపర్ కింద వుంచాడు. మర్నాడు అతనే ఆ నేరానికి కోర్టులో ఫైన్ కట్టి ఓ ప్రశ్నకి సమాధానంగా అది తన కారేనని చూసుకోలేదని జడ్జికి చెప్పాడు.

* ఓ ముసలావిడ రైల్వే స్టేషన్‌లో టేక్సీ ఎక్కి తన అల్లుడి విజిటింగ్ కార్డు ఇచ్చి అక్కడికి తీసుకెళ్ళమంది. దాన్ని చదివిన డ్రైవర్ 'మేడం, ఇది సిన్ సిన్నాటి. మీరెళ్ళాల్సింది ఇండియానా పోలీస్. తప్పు స్టేషన్ రైలు దిగారు' అని చెప్పాడు.

* బిల్డింగ్ మెటీరియల్స్‌ని దొంగిలించిన కొందరు దొంగలు అక్కడ కాపలాగా వుంచిన ఆల్సేషియన్ డాగ్‌ని కూడా దొంగిలించారు.

* 'రాంగ్ పార్కింగ్ నేరాలు అధికం అవుతున్నాయి కాబట్టి ఇక మీదట మీరు అలర్టుగా వుండాలి' అని తన కింది వుద్యోగులకి చెప్పిన పోలీస్ చీఫ్ కారుకి అయిదు నిముషాల తర్వాత రాంగ్ పార్కింగ్ టికెట్‌ని రాశారు పోలీసులు.

* జైల్లోంచి తప్పించుకున్న ఓ దొంగని జైలు అధికారులు వారం తర్వాత పట్టుకుని జైల్లో వుంచారు. ఆ జైలు ఆఫీసర్ ఇంట్లో టైప్ రైటర్ రిపేర్ చేయడానికి ఫర్మ్‌నించి పంపబడ్డ రిపేరర్ ఆ దొంగగారే. జైలర్ గుర్తు పట్టాడు.

* ఓ హాలీవుడ్ సినిమాలో 'రెడ్ ఇండియన్స్ పాత్రలు' వేయడానికి వచ్చిన పదిమందిని వాళ్ళు ఇండియన్స్‌లా లేరని వంపించేశారు. నిజానికి ఆ పది మంది రెడ్ ఇండియన్స్!

* ఓ పోలీస్ కార్‌ని దొంగిలించాలని ప్రయత్నించిన ఓ దొంగ స్టార్టర్ బటన్ బదులు సైరన్ బటన్ నొక్కాడు. వెంటనే పక్క షాపులోని పోలీసులు పరుగెత్తుకొచ్చి అతన్ని అరెస్ట్ చేశారు.

* ఓ గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్‌లోకి దొంగలు జొరబడి క్రొత్తగా అచ్చయిన 10,000 కాపీలు ఎత్తుకెళ్ళారు. నేర నిరోధక చర్యలని బోధించే పుస్తకం అది.

* లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ 'పర్ఫెక్ట్ అటెండన్స్' గల ఓ సభ్యుడికి షీల్డ్ ఇవ్వడానికి ఏన్యువల్ మీటింగులో లేచి అతని పేరును అనౌన్స్ చేశాడు. ఆ రోజు ఆ సభ్యుడు రానేలేదు.

* ఓ ముసలావిడ తన వాచ్‌డాగ్‌ని దొంగలు ఎత్తుకెళ్ళారని పోలీసు స్టేషన్‌లో రిపోర్ట్ చేసింది. మర్నాడు వచ్చి ఆ డాగ్ బెల్ట్‌ని కూడా దొంగిలించారని మళ్ళీ రిపోర్ట్ చేసింది.

* ఓ దొంగల ముఠా ఓ అర్ధరాత్రి ఓ సూపర్ బజార్‌లోని పెద్ద కేష్ సేఫ్‌ని దొంగిలించింది. కాని దాన్ని తమ వేన్‌లో ఎక్కిస్తుండగా అది లోపలికి వెళ్ళక, బయటికి రాక ఇరుక్కుంది. ఆ వేన్‌ని, సేఫ్‌ని వదిలి వెళ్ళిపోయారా ముఠావాళ్ళు.

* అలారం టైంపీస్‌ని దొంగిలించినందుకు ఓ దొంగకి మూడు నెలల శిక్ష పడింది. అవి ఓ పోలీస్‌స్టేషన్‌లోంచి దొంగిలించాడు.

* సబ్‌వే ట్రెయిన్ కమ్యూటర్స్ (ప్రయాణీకులు) అసోసియేషన్ ప్రెసిడెంట్ ట్రయిన్స్ ఆలస్యానికి సంబంధించిన ప్రొటెస్ట్ మీటింగ్‌కి గంటన్నర ఆలస్యంగా వెళ్ళాడు. కారణం రైలు ఆలస్యం అవడమే.

* న్యూయార్క్‌లోని ఓ దొంగతనానికి సంబంధించిన నేరస్థుడి కోసం ఎఫ్.బి.ఐ. రెండు నెలలపాటు వెదికి చివరికి అతన్ని వాషింగ్‌టన్‌లో పట్టుకొంది. అక్కడ ఎఫ్.బి.ఐ. హెడ్‌క్వార్టర్స్‌లో అతగాడు స్టాఫ్ మెస్‌లో వంటవాడుగా పనిచేస్తున్నాడు.

* ఇంగ్లండ్‌లో ఓ తల్లి రాసిన చెక్‌ని ఆమె బేంక్‌వారు తిప్పి పంపించేశారు. కారణం సిక్స్ పౌండ్స్, సిక్స్ షిల్లింగ్స్ అని రాయడానికి బదులుగా, 'సిక్స్ పౌండ్స్, సిక్స్ చిల్డ్రన్' అని రాసింది అక్షరాల్లో.

* ఆరిజోనాలో ఓ చోట అమెరికన్ ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ రెనొవేషన్ కోసం 1,46,660 డాలర్లు సేంక్షన్ చేసింది. అసలక్కడ ఎయిర్‌పోర్టే లేదు.

* ఓ కోర్టులో న్యాయవిచారణకోసం తీసుకురాబడ్డ ఓ దొంగ, ముగ్గురు లేచి కుడి చేతిని ఎత్తి నిలబడటంతో, తనూ వాళ్ళ పక్కకి

వెళ్ళి అలాగే నిలబడ్డాడు. పొరపాటుగా జడ్జి ఆ దొంగచేత కూడా పోలీస్ వుద్యోగంలో చేరేప్పుడు చేసే ప్రమాణాన్ని చేయించాడు.

* ఓ జడ్జి ఏక్సిడెంట్‌లో ఇన్‌వాల్వ్ అయిన ఓ కారు డ్రయివర్ తప్పేం లేదని శిక్ష వేయకుండా వదిలేశాడు. అయిదు నిమిషాల తర్వాత జడ్జి తన కారులో ఇంటికి వెళ్తుంటే మరో కారు వచ్చి జడ్జి కారుని గుద్దింది. నిరపరాధిగా వదిలేసిన డ్రైవర్‌దే ఆ కారు.

# హేపీ బర్త్ డే

సొసైటీలో అంతా కలిసి చేసుకునే పండుగలన్నీ ఒక ఎత్తు. ఎవరికి వారు వ్యక్తిగతంగా చేసుకునే పండుగ ఒక ఎత్తు. అదే పుట్టిన రోజు.

పుట్టిన రోజుని పండుగగా చేసుకునే సాంప్రదాయం మనకి ఆంగ్లేయుల నుంచి వచ్చిన ఆచారం. పెద్దవాళ్ళయ్యేకొద్దీ ఈ సరదా పోతుంది కాని చిన్నపిల్లలు దీన్ని సరదాగా చేసుకుంటుంటారు. 'నా బర్త్ డేకి రండి' అని నలభై ఏళ్ళ వాళ్ళు పిలుస్తే ఎబ్బెట్టుగా అనిపిస్తుంది.

ఇండియాలో ప్రతి మనిషికి బర్త్‌డేలు రెండుంటాయి. ఒకటి కేలండర్ తేదీ ప్రకారం చేసుకునేది. ఇంకోటి తిథిని బట్టి చేసుకునేది. మొదటి దానికే బర్త్‌డే సెలబ్రేషన్‌కి ప్రాధాన్యత నిస్తున్నారు.

ముఖ్యంగా ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలు, తమ బర్త్‌డే రోజు స్కూల్ యూనిఫారం బదులు మామూలు బట్టలు వేసుకెళ్ళచ్చన్న నియమం చాలా స్కూళ్ళలో వుంది. పెన్సిల్స్, చాక్లెట్స్, బొమ్మలు లాంటివి కొనిస్తే స్కూల్లో క్లాస్‌మేట్స్ అందరికీ వాటిని పంచడం కూడా నేటి నాగరికతగా మారింది. అలాగే కేక్ మీద కొవ్వొత్తు లుంచి, వాటిని వూది కట్ చేయడం, ఇంట్లో గోడలకి రంగు కాగితాలు, బూరలు కట్టడం లాంటివన్నీ కూడా యూరప్ నుంచి ఇంపోర్ట్ అయిన